

ప్రభాకర్‌కు నియామకపత్రం అందజేస్తున్న భీమ్

ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడిగా రొంపి ప్రభాకర్

ఎర్రగడ్డ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడిగా రొంపి ప్రభాకర్‌ను నియమిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు భీమ్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం రొంపి ప్రభాకర్‌కు ఆయన నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ బలోపేతం చేసేందుకు నగరంలో డివిజన్ల వారీగా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రొంపి ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ నాయకులను ఏకతాటిపై నడిపించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, కార్యదర్శులు శంకర్, ఎన్.సంజీవ్, నాయకులు జి.రాజయ్య, కే.మహేష్ కుమార్, బి.విజయ్ కుమార్, ఏ.అంజయ్య, ఏ.సత్యనారాయణ, ఆర్.సురేందర్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, మహేష్ యాదవ్ తదితరులు

పేదలకు దుప్పట్ల పంపిణీ

ఖైరతాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డబ్బు సంపాదించడం గొప్ప కాదని, అందులోంచి ఎంత వరకు పేదలకు సహాయం చేస్తున్నామన్నదే గొప్ప విషయమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శనివారం ఖైరతాబాద్ గ్రంథాలయ వేదికతో పాటు పలు ప్రాంతాల్లో 600 మందికి శివలాల్ యాదవ్ ట్రస్టు ఆధ్వర్యంలో బ్లాంకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దానం నాగేందర్ కార్పొరేటర్ లక్ష్మీరామన్‌గౌడ్, బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు కాటం నర్సింహతో కలిసి పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. 22 ఏళ్లుగా పేదలకు సేవలు చేస్తున్న మహేష్ ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్‌కే షరీఫ్, నాయకులు లక్ష్మణ్ యాదవ్, కె.రాజు, గంగాధర్ యాదవ్, కమ్మరి వినయ్, మురళి, అనిల్, శివ రమాదేవి, ట్రస్టు సభ్యులు సుజాత, శ్రీధర్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల పెళ్లికి లండన్ నుంచి వచ్చిన యువకుడి అదృశ్యం

యూసుఫ్‌గూడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్నేహితుల పెళ్లిళ్ల కోసం లండన్ నుంచి వచ్చిన యువకుడు అదృశ్యమైన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఏపీలోని అనంతపురం జిల్లా ఉరవకొండ సమీపంలోని వెలిగొండకు చెందిన ఎం.లక్ష్మీరెడ్డి లండన్‌లో ఉంటున్నాడు. స్నేహితుల పెళ్లిళ్లు ఉండటంతో నవంబరు 2న ఇక్కడకు వచ్చాడు. ఎల్లారెడ్డిగూడలోని తన బంధువు యువప్రశాంత్ వద్ద ఉంటూ స్నేహితుల పెళ్లిళ్లకు వెళ్తున్నాడు. చివరిగా నవంబరు 17న ఆఖరి వివాహానికి వెళ్లి వచ్చాడు. రెండు రోజుల తర్వాత చెప్పకుండా వెళ్లిపోయి కొద్ది రోజుల తర్వాత తిరిగివచ్చాడు. అయితే నవంబరు 26న ఇంటి నుంచి వెళ్లిపోయిన అతడు ఇంత వరకు తిరిగి రాలేదు. ఫోన్ చేసినా అందుబాటులోకి రాకపోవడంతో యువప్రశాంత్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కస్టమర్‌పై టీ స్టాల్ యజమాని దాడి

యూసుఫ్‌గూడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కస్టమర్‌పై టీ స్టాల్ యజమాని దాడి చేసిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రహ్మత్‌నగర్‌లో నివసించే విష్ణుకాంత్ తన స్నేహితుడితో కలిసి శనివారం రాత్రి రహ్మత్‌నగర్ చౌరస్తాలోని టీ పాయింట్‌కు వచ్చాడు. తన ద్విచక్రవాహనాన్ని పార్కు చేసి ఇద్దరూ టీ తాగుతున్నారు. ఇంతలో టీ స్టాల్ యజమానుల్లో ఒకరైన వాహిద్ వచ్చి విష్ణుకాంత్ ద్విచక్రవాహనాన్ని పక్కనపెట్టి తన వాహనాన్ని పార్కు చేశాడు. విష్ణుకాంత్ తన వాహనం ఎందుకు తీశారని అడగటంతో అసభ్యపదజాలంతో దూషించాడు. ఘర్షణ నేపథ్యంలో విష్ణుకాంత్ మోహంపై, చాతిపై కొట్టాడు. ఇంతలో మరో ముగ్గురు వచ్చి విష్ణుకాంత్‌ను కొట్టి గాయపరిచారు. బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ పార్కింగ్ విషయంలో ఘర్షణ.. కేసు నమోదు

బోరబండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ద్విచక్రవాహనాన్ని నిలపడంపై ఇద్దరి వ్యక్తుల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న ఘటన బోరబండ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో చోటుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీఆర్‌హిల్స్ గంగానగర్‌కు చెందిన తాహేర్ అదే బస్తికి చెందిన సాజీద్ ఇంటి ముందు బైక్ నిలిపాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సాజీద్ అన్న మిత్రుడు ఇమ్రాన్, ఖాజా, ఇబ్రహీంలను పిలిచి తాహేర్‌పై దాడికి దిగారు. తాహేర్ తల్లిపై సైతం దాడి చేశారు. తాహేర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటిలో మునిగి.. మట్టిలో కూరుకుపోయి

- పదేళ్లుగా దురవస్థలో బీజేఆర్ నగర్ ప్రాథమిక పాఠశాల
- మరో ప్రాంతానికి తరలించి చేతులు దులుపుకున్న అధికారులు
- రెండు కిలోమీటర్ల దూరం వెళ్తున్న విద్యార్థులు
- కొత్త భవనం నిర్మించాలని కోరుతున్న స్థానికులు

బంజారాహిల్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎంతో మందికి విద్యనందించిన ప్రభుత్వ పాఠశాల ఇప్పుడు మురుగు నీటిలో మునిగిపోయింది. దశాబ్ద కాలంగా నెలకొన్న సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు కొద్ది కాలం క్రితం విద్యార్థులను మరోచోటకు తరలించి చేతులు దులుపుకున్నారు. ఫలితంగా ఇప్పుడు ఆ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుతోంది. స్థానికులు భవన నిర్మాణ వ్యర్థాలు వేసి మరింత నిరుపయోగంగా తయారు చేస్తున్నారు. చిన్నారులు బ్యాగులు పట్టుకొని రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో బస్తీలోని స్కూల్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్థానంలో కొత్త భవనం నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేసినా పాలకులు, అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు.

స్థానికుల కృషితో స్కూల్ ప్రారంభం

బీజేఆర్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలాన్నిబూ ఈఆళళళ చాలా మంది ఆక్రమించుకొని గుడిసెలు వేసుకున్నారు. అక్కడక్కడా చిన్న స్థలాలు మిగిలి ఉండటంతో బస్తీ వాసులంతా వాటిని కాపాడేందుకు ఒక్కతాటి పైకి వచ్చారు. ఇందులో భాగంగా 250 గజాల స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల కోసం కేటాయించుకున్నారు. అయితే కొందరు దాన్ని కూడా ఆక్రమించుకునే ప్రయత్నాలు చేయడంతో బస్తీ వాసులు పాలకుల చుట్టూ తిరగగా ప్రాథమిక పాఠశాల మంజూరైంది. ఆ తర్వాత పది మంది ఉపాధ్యాయులు, రెండు వందల మందికి పైగా విద్యార్థులతో తరగతులు ప్రారంభమయ్యాయి.

నాలా ఆక్రమణతో సమస్యలు

పాఠశాల మురుగును అప్పటి గుత్తేదారు పైప్ లైన్ ద్వారా వెనుక వైపు ఉన్న నాలాలోకి కలిపేశాడు. అయితే మొదట్లో ఏ సమస్యా లేనప్పటికీ క్రమేణా నాలా ఆక్రమించి నిర్మాణాలు వచ్చాయి. పాఠశాల చుట్టూ భవనాలు పెరిగాయి. ఈ క్రమంలో పాఠశాల మురుగు పైప్‌లైన్ కిందకు వెళ్లడంతో నాలాలో మురుగు నీరు బయటకు వెళ్లకుండా పాఠశాల భవనంలోకి చేరుతోంది. నాలుగేళ్ల క్రితం భారీ వర్షాలు కురవడంతో స్కూల్ నీట మునిగింది. కొద్దిరోజులు స్కూల్‌కు సెలవులు ఇచ్చి మోటార్ల ద్వారా నీటిని తొలగించారు. స్థానికంగా ఉండే కొంత మంది యువకులు భవనం నుంచి నీరు వెళ్లేందుకు కొత్త పైప్ లైన్ ఏర్పాటు చేశారు. కొద్ది రోజులు బాగానే ఉన్నప్పటికీ ఓ నిర్మాణదారుడు ఈ పైప్‌లైన్‌ను తొలగించి భవనం నిర్మించడంతో సమస్య మొదటికి వచ్చింది. ఇక చేసేది లేక విద్యాశాఖ అధికారులు స్కూల్‌ను సమీపంలోని మరో పాఠశాలకు తరలించారు. కొందరు నిర్మాణ వ్యర్థాలను వేసి పాఠశాల భవనాన్ని శిథిలావస్థకు తీసుకొచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



భూమిలో కూరుకుపోయిన పాఠశాల భవనం



భవనం చుట్టూ నిలిచిన మురుగునీరు

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు



పిల్లల భవిష్యత్తు విషయంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పాత పాఠశాల భవనం స్థానంలో కొత్తది నిర్మించి ఉన్నత పాఠశాలగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. చాలా మంది పిల్లలు పక్క బస్తీలో ఉన్న పాఠశాలలకు వెళ్తున్నారు. మరికొందరు ఇంటికే పరిమితమవుతున్నారు.

- నడిమింటి కృష్ణ, స్థానికుడు

కబ్జాకు గురయ్యే అవకాశం



పదేళ్ల క్రితం పాఠశాల భవనానికి మురుగు సమస్య మొదలైంది. అప్పుడు శాశ్వత పరిష్కారం ఆలోచించి ఉంటే బాగుండేది. కానీ ఎవరూ పట్టించుకోలేదు. నాలుగేళ్ల క్రితం పాఠశాలను మూసి వేశారు. ఇప్పుడు భవనం చుట్టూ మురుగు నీరు పెరిగిపోయి దుర్వాసన వస్తోంది. ఇలాగే వదిలేస్తే కబ్జాకు గురయ్యే అవకాశం ఉంది.

- అనిత, బీజేఆర్‌నగర్ బస్తీ

నీటి పొదుపుపై ఇంటింటి ప్రచారం

ఖైరతాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు అడుగంటిపోతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, మొక్కలు నాటాలని సేవ్ ఎర్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూం సముదాయాలు, ఇందిరానగర్ కాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో తాగునీరు వృథా అవుతున్న తీరును గుర్తించి, స్థానికుల్లో అవగాహన కల్పించారు. భూగర్భ నీటి వనరుల శాఖ విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ జల సత్యనారాయణ సేవ్ ఎర్త్ ప్రతినిధులతో కలిసి ప్రజలకు కరపత్రాలను అందిస్తూ నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా నీటి సంక్షోభం ఉన్న నేపథ్యంలో భవిష్యత్ తరాలకు సరిపడా నీరు అందేలా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సేవ్ ఎర్త్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు రంజిత్, ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్‌లో నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, సంస్థ ప్రతినిధులు

సింహగర్జనకు తరలిన మాలలు



మాలల సింహగర్జనకు ఖైరతాబాద్ అంబేడ్కర్ విగ్రహం నుంచి బయల్దేరుతున్న మాలలు

ఖైరతాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాలల సింహగర్జన సభకు ఖైరతాబాద్ నుంచి మాల కులస్థులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మార్కెట్ చౌరస్తా వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు రాష్ట్ర నాయకుడు బి.శ్యాంకుమార్ ఆధ్వర్యంలో పూజలు చేసి భారీ ర్యాలీగా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మాల నేతలు నాగేశ్వరరావు, గజ్జెల ఆనంద్, శంకర్‌దాస్, డాక్టర్ నిమ్మ బాబూరావు, కృష్ణ, శ్రీను అర్జున్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొనెల రమేష్ ఆధ్వర్యంలో రహ్మత్‌నగర్ నుంచి మాలల సింహగర్జనకు మాల కులస్థులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఎస్పీఆర్ హిల్స్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం వారు సింహగర్జనకు ర్యాలీగా తరలివెళ్లారు.



మాల మహానాడు నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొనెల రమేష్ ఆధ్వర్యంలో రహ్మత్‌నగర్ నుంచి తరలివెళ్తున్న మాలలు



కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిని సందర్శించిన అమెరికన్ కాలేజ్ ఆఫ్ నర్స్ మిడ్ వైవ్స్ ప్రతినిధులు

కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిని సందర్శించిన అమెరికన్లు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అమెరికన్ కాలేజ్ ఆఫ్ నర్స్ మిడ్ వైవ్స్ ప్రతినిధుల బృందం బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిని ఆదివారం సందర్శించింది. వైద్యరంగంలో అవలంబిస్తున్న చికిత్స పద్ధతులు, ఆధునిక టెక్నాలజీతో కూడిన ఆపరేషన్ థియేటర్లను బృందం సభ్యులు పరిశీలించారు. ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు ఉపయోగిస్తున్న ఆధునిక టెక్నాలజీ, చికిత్స విధానాలను అడిగి తెలుసుకున్నారు. అమెరికన్ కాలేజ్ ఆఫ్ నర్స్ మిడ్ వైవ్స్ డెలిగేషన్ ప్రతినిధి డాక్టర్ కేథరీన్ కాలిన్స్ ఫులియా తో పాటు ప్రతినిధి బృందానికి కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధాకర్ జాదవ్, ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ షైనీ చేరియన్ పలు వివరాలను అందించారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందజేస్తున్న కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిని సందర్శించి ఆధునిక చికిత్స విధానాలను తెలుసుకోవడం ఎంతో ఉపయోగపడుతుందని డాక్టర్ కేథరీన్ కాలిన్స్ ఫులియా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఇంటర్నేషనల్ బిజినెస్ రిలేషన్స్ హెడ్ గోకుల్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ఖైరతాబాద్ విద్యార్థుల ప్రతిభ

ఖైరతాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఒకినవా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు పుణేలోని శివ్ ఛత్రపతి స్టేడియంలో జరిగిన 27వ ఓమా నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటారు. 28 నుంచి 1వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో 21 రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొనగా 9 మంది బంగారు పతకాలను, నలుగురు వెండి పతకాలను, మరో 5 మంది రజత పతకాలను సాధించారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్‌లు



కార్యక్రమంలో మాట్లాడుతున్న చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం వీసీ సూర్యధనుంజయ్

తెలుగు సాహిత్యాకాశంలో 'యువభారతి' వెలుగు దివ్వెలు

ఖైరతాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యాకాశంలో యువభారతి వెలుగు దివ్వెలు ధ్రువతారలుగా వెలుగుతున్నాయని చాకలి ఐలమ్మ విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య సూర్యధనుంజయ్ అన్నారు. ఆదివారం యువభారతి, రసమయి సంస్థ, ఐఐఎంసీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాలలో తెలుగు వెలుగు సమాఖ్య రెండవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై సమాఖ్య కార్యక్రమాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలుగు సాహిత్య విద్యార్థినిగా తాను యువభారతిని దగ్గరగా చూశానని, అద్భుతమైన గ్రంథాలను రచించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో యువభారతి కార్యదర్శి జీడిగుంట, ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్, ప్రతినిధులు కల్యాణి, డాక్టర్ ఎస్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆస్పత్రి నుంచి రోగి అదృశ్యం

బోరబండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి నుంచి రోగి అదృశ్యమైన ఘటన ఆదివారం జరిగింది. బాలానగర్‌కు చెందిన నర్సింగ్‌రావు మానసిక ఆరోగ్యం సరిగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు నవంబర్ 18న ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో చేర్పారు. ఈ క్రమంలో చికిత్స తీసుకుంటున్న నర్సింగ్‌రావు ఆదివారం నుంచి కనిపించడం లేదు. అతడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

ఉగాండా నుంచి వచ్చి.. నగరంలో వ్యభిచారం

- ఇద్దరు విదేశీ యువతులు, విటుడు అరెస్ట్

తార్నాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉగాండా నుంచి నగరానికి వచ్చిన ఇద్దరు విదేశీ మహిళలు వ్యభిచార గృహాన్ని నడుపుతున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు వ్యభిచారం గృహంపై దాడి చేసి ఇద్దరు ఉగాండా యువతులతో పాటు.. ఒక కస్టమర్‌ను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. ఉగాండాకు చెందిన నయేబేర్ జోరీన్ నెల రోజుల క్రితం నగరానికి వచ్చి తార్నాక పరిధిలోని నాగార్జుననగర్ పరిధిలో ఓ ఇల్లును అద్దెకు తీసుకుంది. కొంత కాలంగా ఇక్కడే ఉంటున్న తన దేశానికి చెందిన కొముహంగి రీటాతో కలిసి వ్యభిచారం నిర్వహించి డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేశారు. వారి ఫోన్ నంబర్‌ను లోకాంటో వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేసి కస్టమర్స్‌ను ఆకర్షించేవారు. ఈ క్రమంలో విదేశీయులు నగరంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.సైదులుకు విశ్వసనీయ సమాచారం అందింది. దాంతో తన టీమ్‌తో రంగంలోకి దిగిన ఇన్‌స్పెక్టర్ ఓయూ పోలీసులతో కలిసి వ్యభిచారం నిర్వహిస్తున్న గృహంపై దాడిచేశారు. ఇద్దరు ఉగాండా మహిళలతో పాటు.. ఉప్పల్‌కు చెందిన కస్టమర్ పొత్తూరి అంజన్‌కుమార్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.12,190 నగదు, 160 కండోమ్స్, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.



ర్యాలీకి తరలివెళ్తున్న బీజేపీ నాయకులు

పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీజేపీ నేత గౌతమ్‌రావు

ఎర్రగడ్డ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు విమర్శించారు. ఆదివారం కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసనగా ఎర్రగడ్డ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఉచిత బస్సు తప్ప మరే పథకాలు అమలుకాలేదన్నారు. ప్రభుత్వ పాలన ప్రజా వ్యతిరేకంగా ఉందని, సంవత్సర కాలంలోనే ప్రజలు ప్రభుత్వాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశంలో జనరంజక పాలన కొనసాగుతుందని, అందుకు మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. బైక్ ర్యాలీ ఎర్రగడ్డ కల్యాణ్ నగర్ వెంచర్ 3లోని వివేకానంద విగ్రహం నుంచి యూసుఫ్‌గూడ, శ్రీనగర్ కాలనీల మీదుగా అమీర్‌పేట పార్టీ ఆఫీస్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇన్చార్జి లంకల దీపక్ రెడ్డి, నాయకులు కుంభాల గంగరాజు, ప్రేమ్ కుమార్, దర్శనం నాగేశ్వరరావు, దేరంగుల ప్రసన్న, ఈదులకంటి రాజేష్, అనంతలక్ష్మి, బీ.రూప, కొలను సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ పట్ల అవగాహన అవసరం

- డాక్టర్ వినోద్‌కుమార్

ఎర్రగడ్డ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఎర్రగడ్డ చెస్ట్ ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చెస్ట్ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఐవీ వంటి భయంకరమైన వ్యాధి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపవద్దన్నారు. ప్రపంచవ్యాప్తంగా కేసుల సంఖ్య తగ్గుతూ వస్తోందని.. 2010తో పోల్చుకుంటే ఇప్పుడు 39% మేర తక్కువ కేసులు నమోదైనట్లు తెలిపారు. హెచ్‌ఐవీ బాధితులు ఏఆర్‌టీ మందులను వాడడం వల్ల ఎక్కువ కాలం జీవించే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వ్యాధిగ్రస్తులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమోద్ కుమార్, డాక్టర్ అనిత, డాక్టర్ రుద్ర గణేష్, సిబ్బంది సతీష్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినోద్ కుమార్



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జీవో 317 బాధితులు

జీవో 317తో స్థానికత కోల్పోయాం

- సీఎం న్యాయం చేయాలని బాధితుల విజ్ఞప్తి

ఖైరతాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 317తో తాము స్థానికత కోల్పోయామని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం న్యాయం చేయాలని బాధిత ఉద్యోగులు కోరారు. ఆదివారం ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీవో 317 బాధిత జేఏసీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రతినిధులు మధుసూదన్‌రెడ్డి, సందీప్, రాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఈ జీవో సవరణ కోసం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసినా.. వారు 8 నెలల పాటు కాలయాపన చేసి పాత జీవోను కొనసాగించాలని పేర్కొనడం దారుణమన్నారు. స్థానికత కోసమే తాము పోరాటం చేశామన్న విషయాన్ని గుర్తించి తమకు సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

మెరుగైన విద్యాబోధనపై దృష్టి సారించాలి

- యునెస్కో ప్రోగ్రామ్ ఆఫీసర్ సరితా జాదవ్

బంజారాహిల్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాలానికి అనుగుణంగా అత్యాధునిక విద్యావిధానాలతో పాఠశాలలను ఎలా సిద్ధం చేయాలనే అంశంపై నిర్వాహకులు దృష్టి సారించాలని యునెస్కోకు చెందిన నేషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సరితా జాదవ్ సూచించారు. హైదరాబాద్ సహోదయ స్కూల్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో 'సమన్వయ-2024' పేరుతో జాతీయ సదస్సును బంజారాహిల్స్‌లో నిర్వహించారు. రాష్ట్రంలోని 281 సీబీఎస్ఈ స్కూళ్లకు చెందిన ప్రతినిధులు పాల్గొని సరికొత్త విద్యావిధానాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సరితా జాదవ్ మాట్లాడుతూ.. గ్లోబల్ ఎడ్యుకేషన్ విధానానికి అనుగుణంగా విద్యాబోధనను మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



సదస్సులో పాల్గొన్న సరితాజాదవ్ తదితరులు



క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

అంతర్జాతీయ స్థాయిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం

- క్రీడాకారుల అభిప్రాయాలు తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

సికింద్రాబాద్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): సిఖ్‌విలేజ్ ధోబీఘాట్ గ్రౌండ్‌లో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించనున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణంపై క్రీడాకారులతో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ చర్చించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం, నిర్వహణ అంశాలపై వారి అభిప్రాయాలను సేకరించారు. గతంలో ఎవరూ చేపట్టని విధంగా ఓ శాసనసభ్యుడు తమ వద్దకు వచ్చి అభిప్రాయాలను తెలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని క్రీడాకారులు అన్నారు. తమ అభిప్రాయాలకు, సలహాలు, సూచనలకు ప్రాధాన్యతను ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రీగణేశ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందని, ఈ నేపథ్యంలో కంటోన్మెంట్‌లోని సిఖ్ విలేజ్ ధోబీ ఘాట్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించడానికి రంగం సిద్ధం చేసింద న్నారు. ఇటీవలే జిల్లా ఇన్‌చార్జి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్ వచ్చి ఈ గ్రౌండ్‌ను పరిశీలించారన్నారు. కాగా క్రికెట్ ప్రాక్టీస్‌కు పిచ్‌లు, బాడ్మింటన్ కోర్టులు, స్విమ్మింగ్ పూల్, వాకర్స్ సీనియర్ సిటిజన్స్ కోసం వాకింగ్ ట్రాక్, వ్యూవర్స్ గ్యాలరీ, వాటర్ ఫెసిలిటీ, టాయిలెట్లు, ఇలా అన్ని సదుపాయాలతో అంతర్జాతీయ స్థాయిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.



టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న సాయిబాబా, మహేందర్ యాదవ్

టీడీపీకి పునర్ వైభవం తీసుకురావాలి

చిలకలగూడ,డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడు టి.వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సికింద్రాబాద్ పార్లమెంటు నియోజక వర్గం అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ పి.సాయిబాబా, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ర్యాల మహేందర్ యాదవ్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి సభ్యత్వ నమోదును లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, పార్టీ పటిష్టతకు, పునర్ వైభవానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తార్నాక డివిజన్ అధ్యక్షుడు గండికోట విజయ్‌కుమార్, అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షుడు కాతా విజయ్‌కుమార్, బౌద్ధనగర్ అధ్యక్షుడు జి.ప్రవీణ్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జర్నలిస్ట్ నాయకులు, జర్నలిస్టులు

జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు

బౌద్ధనగర్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పరిధిలో పనిచేస్తున్న పాత్రికేయులకు హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (హెచ్‌యూజే- టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో త్వరలో హెల్త్‌కార్డులు అందజేస్తామని జర్నలిస్ట్ నాయకులు ప్రకటించారు. ఆదివారం నామాలగుండు బీఎస్‌ఆర్ గార్డెన్‌లో సికింద్రాబాద్ అసెంబ్లీ పరిధిలో పని చేస్తున్న జర్నలిస్ట్‌ల సమావేశం నిర్వహించారు. పలువురు జర్నలిస్ట్ నాయకులు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. అనేక మంది జర్నలిస్టులు తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, ఈ నేపథ్యంలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు జర్నలిస్ట్‌లకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఈ.చంద్రశేఖర్, హెచ్‌యూజే ఉపాధ్యక్షుడు ఉలుసు బ్రహ్మానందం, రమేష్ వాల్మీకి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మామిడి సోమయ్య, బసవ పున్నయ్య, హెచ్‌యూజే అధ్యక్ష కార్యదర్శులు బి.అరుణ్‌కుమార్, బి.జగదీశ్వర్, కోశాధికారి బి.రాజశేఖర్‌తో పాటు లష్కర్ జిల్లాసాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో పాటు భార్యాభర్తల అదృశ్యం



చిన్నారులతో అదృశ్యమైన తల్లిదండ్రులు

బోయిన్‌పల్లి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): వైద్య పరీక్షల కోసమని ఆసుపత్రికి వెళ్లిన భారాభర్తలు తమ ఇద్దరు చిన్నారులతో పాటు అదృశ్యమయ్యారు. బోయిన్ పల్లి పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్‌ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి బడేగూడకు చెందిన అహ్మద్ బేగ్ (30)కు సనాసుల్తాన్ (25)తో ఆరేళ్ల క్రితం పెళ్లైంది. వారికి కుమారుడు అర్హాన్ (4), 9 నెలల కూతురు జకీయ సంతానం. సనా సుల్తానా ప్రస్తుతం 6 నెలల గర్భిణి కావ డంతో కొన్ని రోజులుగా తన తల్లిదండ్రుల ఇంట్లో ఉంటోంది. గతనెల 29న అహ్మ ద్ బేగ్ తన భార్య సనా సుల్తానాను తన ఇంటికి తీసుకొచ్చాడు. అదేరోజు ఉదయం 5 గంటలకు వైద్య పరీక్షల నిమిత్తం తమ ఇద్దరు చిన్నారులను తీసుకొని భార్యాభర్తలు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి వెళ్లారు. వారు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా పని చేయడం లేదు. బంధువులను ఆరా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు



ట్రాన్స్ ఫార్మర్ నుంచి ఎగసి పడుతున్న మంటలు

అడ్డగుట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుకారాంగేట్ ఇందిరాగాంధీ విగ్రహం నుంచి మరాఠా బస్తీ వైపు వెళ్లే దారిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఎలాంటి ప్రాణ నష్టం కలుగకుండా తుకారాంగేట్ పోలీసులు భద్రత కల్పించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని ఆర్పివేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ట్రాన్స్ ఫార్మర్‌కు ఉన్న విద్యుత్ పరికరాలు పూర్తిగా మంటల్లో కాలి బూడిదయ్యాయి.

ఉగాండా నుంచి వచ్చి..నగరంలో వ్యభిచారం

- ఇద్దరు విదేశీ యువతులు, విటుడు అరెస్ట్

తార్నాక, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉగాండా నుంచి నగరానికి వచ్చిన ఇద్దరు విదేశీ మహిళలు వ్యభిచార గృహాన్ని నడుపుతున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు వ్యభిచారం గృహంపై దాడి చేసి ఇద్దరు ఉగాండ యువతులతో పాటు.. ఒక విటుడిని అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. ఉగాండాకు చెందిన నయేబేర్ డోరీన్ నెలరోజుల క్రితం నగరానికి వచ్చి తార్నాక పరిధిలోని నాగార్జుననగర్ పరిధిలో ఓ ఇల్లును అద్దెకు తీసుకుంది. కొంతకాలంగా ఇక్కడే ఉంటున్న తన దేశానికి చెందిన కొముహంగి రీటాతో కలిసి వ్యభిచారం నిర్వహించి డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేశారు. వారి ఫోన్ నంబర్‌ను లోకాంటో వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేసి విటులను ఆకర్షించేవారు. ఈ క్రమంలో విదేశీయులు నగరంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.సైదులుకు విశ్వసనీయ సమాచారం అందింది. దాంతో తన టీమ్‌తో రంగంలోకి దిగిన ఇన్‌స్పెక్టర్ ఓయూ పోలీసులతో కలిసి వ్యభిచారం నిర్వహిస్తున్న గృహంపై దాడిచేశారు. ఇద్దరు ఉగాండా మహిళలతో పాటు.. ఉప్పల్‌కు చెందిన విటుడు పొత్తూరి అంజన్‌కుమార్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.12,190 నగదు, 160 కండోమ్స్, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

నిర్వహణ లేక శిథిలావస్థకు..

సదర్ బజార్‌లో వృథాగా ఉన్న పోస్టాఫీసు భవనం

- చెత్తాచెదారంతో నిండిన రూ. కోట్ల విలువైన స్థలం
- పాముల సంచారంతో స్థానికుల భయాందోళన
- మరమ్మతులు చేయించి తిరిగి పోస్టాఫీసును తెరిపించాలని వినతి





పోస్టల్ శాఖ స్థలంలో దట్టంగా పెరిగిన చెట్లు

తిరుమలగిరి డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, వివిధ పోస్టల్ సేవల నిమిత్తం వచ్చే ప్రజలతో ఒకప్పుడు కళకళలాడిన భవనం నేడు నిర్వహణ లేక శిథిలావస్థకు చేరింది. ఇక్కడ ఉన్న ఖాళీ స్థలంలో దట్టంగా చెట్లు, పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పెరిగిపోవడంతో పాములు, విషపురుగులకు నిలయంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పోస్టల్‌శాఖ ఉన్నతాధికారులు సదర్ బజార్‌లో శిథిలావస్థకు చేరిన ఈ బంగ్లాకు మరమ్మతులు చేయించి, తిరిగి పోస్టాఫీసు సేవలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రిటీష్ కాలం నాటి బంగ్లా..

సదర్ బజార్‌లోని ఓ బంగ్లాలో బ్రిటీషుల కాలం నుంచీ పోస్టాఫీసు కొనసాగేది. స్థానికులు మెరుగైన సేవలందిస్తున్న ఈ కార్యాలయంలోని ఉద్యోగులకు కొన్ని కారణాల వల్ల పని భారం తగ్గడంతో ఆ సిబ్బందిని బొల్లారం రైతు బజార్ సమీపంలో ఉన్న పురాతనమైన కార్యాలయంలో విలీనం చేశారు. దీంతో సదర్ బజార్‌లోని కార్యాలయం మూతపడింది. నిరుపయోగంగా ఉన్న ఈ బంగ్లా రోజు రోజుకూ శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితికి చేరుకుంది.

పాములు బయటకు వస్తున్నాయి..

సదర్ బజార్‌లో మూసివేసిన పోస్టల్ ఆఫీసు ముందు కోట్లాది రూపాయలు విలువ చేసే ఖాళీ స్థలం ఉంది. నిర్వహణ లేకపోవడంతో ఆ స్థలంలో దట్టంగా చెట్లు పెరిగి అందులో నుండి పాములు విషపురుగులు బయటకు వస్తుండటంతో స్థానికులను భయభ్రాంతులకు గురవుతున్నారు. పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ విద్యను అభ్యసిస్తున్నారు. చెత్తా చెదారంతో పాటు దట్టమైన చెట్లు ఉండటంతో దోమలు కూడా పెరిగిపోయి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

పోస్టాఫీసును తిరిగి తెరవాలి



సదర్‌బజార్‌లో పోస్టాఫీసును తిరిగి తెరవాలని పోస్టల్ శాఖ అధికారులకు గతంలోనే వినతి పత్రాలు అందజేశాం. అయినా ఫలితం లేదు. ఇక్కడి నుంచి దూరంగా బొల్లారం రైతు బజార్ సమీపంలో ఉన్న పోస్టాఫీసుకు వెళ్లాలంటే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయాన్ని వెంటనే ఓపెన్ చేయాలి.

\- జీవీ బాల్‌రాజ్

పోస్టాఫీసు స్థలం నుంచి చెట్లను తొలగించాలి



సదర్ బజార్‌లో నిరుపయోగంగా ఉన్న పోస్టాఫీసు భవనం ఆవరణలోని ఖాళీ స్థలంలో చెత్తాచెదారం, దట్టంగా చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పాముల సంచారం పెరిగింది. అంతే కాకుండా దోమల వృద్ధి కూడా అధికమైంది. దీంతో స్థానికులతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పోస్టల్ శాఖ అధికారులు వెంటనే ఖాళీ స్థలాన్ని శుభ్రం చేయించి అభివృద్ధి చేయాలని కోరుతున్నా.

\- నరసింహన్ కన్నన్



విజేతలు, విద్యార్థులతో డిప్యూటీ ఈఓ శ్రీధర్ తదితరులు

ఉత్సాహ భరితంగా వ్యాసరచన పోటీలు

రాంగోపాల్‌పేట్, డిసెంబరు1 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాన్ని ఆదివారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆదయ్య మెమోరియల్ పాఠ శాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా 'తరగని శక్తి వనరులు' అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. సికింద్రాబాద్ ప్రాంతం నుంచి వచ్చిన 30 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజయం సాధించిన వారు సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో, అందులో విజేతలైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మండల ఉప విద్యాధికారి జి.శ్రీధర్, మండల నోడ ల్ అధికారి, బేగంపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.యాదగిరి ముఖ్యఅతిథులుగా పాల్గొనగాఅరుణ కుమారి, రాము, విజయలక్ష్మి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఆదయ్య మెమోరియల్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు కె.నారాయణ రెడ్డి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ సుబ్బయ్య

దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు దోహదం

మారేడుపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తులోనూ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య అన్నారు. కంటోన్మెంట్ బోర్డు 4వ వార్డు పరిధిలోని భాస్కర్ రావు గార్డెన్ బస్తీలో ఏర్పాటు చేసిన 8 సీసీ కెమెరాలను ఆదివారం మారేడుపల్లి ఇన్స్‌పెక్టర్ ఎన్.వెంకటేశంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ సుబ్బయ్య మాట్లాడుతూ.... నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఆవశ్యకత ఎంతో ఉందని ఆయన అన్నారు. చోరీ లేదా ఏదైనా నేరం జరిగినప్పుడు సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నేరగాళ్లను త్వరగా గుర్తించి జైలుకు పంపుతున్న సందర్భాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి బస్తీ, కాలనీ, అపార్ట్‌మెంట్‌ల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బస్తీ నాయకులు నరసింహ, పనస సంతోష్, లింగం, రాజ్యం, చందర్, హరి, విజయ్, వెంకట్, శ్రీనివాస్, దుబ్బాక కిషన్ రావు, కపిల్ పాల్గొన్నారు.



చిన్నతోకట్టలో అన్నదానంలో పాల్గొన్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తదితరులు



బౌద్ధనగర్ ఆర్యవైశ్య సంఘం అన్నదానంలో పాల్గొన్న లష్కర్‌జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తదితరులు

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

సికింద్రాబాద్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం అమావాస్య సందర్భంగా ఆదివారం న్యూబోయినపల్లి జయనగర్‌చౌరస్తాలో శ్రీదేవి నల్లపోచమ్మ ఆలయం, చిన్నతోకట్ట కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. హన్మంతురావు, పాల అనుగీత, దుర్గయ్య, ప్రేమ్‌కుమార్, అజిత్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో..

కార్తీకమాసం అమావాస్యను పురస్కరించుకుని బౌద్ధనగర్ గాంధీబొమ్మ వద్ద సికింద్రాబాద్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. లష్కర్‌జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్ర మాన్ని ప్రారంభించారు. నాయకులు రవికుమార్, చంద్రశేఖర్, ప్రభాకర్, వెంకటేశ్వరరావు, మిట్టపల్లి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

లాల్‌బజార్ మహాకాళి ఆలయంలో..

తిరుమలగిరి డిసెంబరు1(ఆంధ్రజ్యోతి):అమావాస్య సందర్భంగా లాల్‌బజార్‌లోని మహాకాళి ఆలయంలో అమ్మవారికి బోర్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్ కుమార్, ప్యారసాని భాగ్యశ్రీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకొని తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రుక్మయ్య, పి.రాజు, దర్శన్ రెడ్డి, జిత్తు భాయ్, చిన్న అన్న, ఉమేష్, వేణుగోపాల్, సురేష్, శ్రీను, సురేష్, అనురాధ రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.



తుకారాంగేట్ నుంచి సింహగర్జనకు వెళ్లిన మాల సంఘం నాయకులు

సింహగర్జన సభకు తరలివెళ్లిన మాల సంఘాల నేతలు

అడ్డగుట్ట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : మాలల ఐక్యతను చాటేందుకు సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఆదివారం నిర్వహించిన సింహగర్జన సభకు అడ్డగుట్ట డివిజన్ నుంచి భారీ సంఖ్యలో తరలివెళ్లినట్టు మాలల సంఘం సీనియర్ నాయకుడు నక్కా మధు తెలిపారు. బైకు ర్యాలీతో పాటు పాదయాత్రగా సభకు వెళ్లామని చెప్పారు. మాలల సంఘాల యూనియన్ నాయకులు ఎంపీసీఐ సీనియర్ నాయకులు ఆర్. మల్లేష్, అమర్, అంబేద్కర్ యువజన సం ఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎన్ సుధాకర్, రామలీల, రమాదేవి, బీజేపీ సీనియర్ నాయకుడు మహేందర్, అంబేద్కర్ యువజన సంఘం కాంగ్రెస్ నాయకుడు ప్రసాద్, చంద్రశేఖర్‌నగర్ బస్తీ నుంచి కోటేశ్వర్‌రావు, ప్రతాప్, మూర్తి, నర్సింగ్‌రావు, ఉమాశంకర్, విజయలక్ష్మి తదితరులు సింహగర్జన సభకు వెళ్లారు.

యూనిటీ ఆఫ్ కంటోన్మెంట్ మాల ఆధ్వర్యంలో..

మారేడుపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మాలల సింహ గర్జనకు యూనిటీ ఆఫ్ కంటోన్మెంట్ మాల ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. పికెట్ అంబేద్కర్ జగ్జీవన్ రామ్ సర్కిల్ నుంచి మహనీయులకు పూలమాల వేసి ర్యాలీగా వెళ్లి సభలో పాల్గొన్నారు. నాయకులు సంకి రవీందర్ బాబు, కేడీ రమేష్, సుస్మిత శంకర్‌రావు, నళిని వెంకట్రావ్, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిని సందర్శించిన అమెరికన్లు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అమెరికన్ కాలేజ్ ఆఫ్ నర్స్ మిడ్ వైఫ్స్ ప్రతినిధుల బృందం బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిని ఆదివారం సందర్శించింది. వైద్యరంగంలో అవలంబిస్తున్న చికిత్స పద్ధతులు, ఆధునిక టెక్నాలజీతో కూడిన ఆపరేషన్ థియేటర్లను బృందం సభ్యులు పరిశీలించారు. ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు ఉపయోగిస్తున్న ఆధునిక టెక్నాలజీ, చికిత్స విధానాలను అడిగి తెలుసుకున్నారు. అమెరికన్ కాలేజ్ ఆఫ్ నర్స్ మిడ్ వైఫ్స్ డెలిగేషన్ ప్రతినిధి డాక్టర్ కేథరీన్ కాలిన్స్ ఫులియా తో పాటు ప్రతినిధి బృందానికి కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధాకర్ జాదవ్, ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ షైనీ చేరియన్ పలు వివరాలను అందించారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందజేస్తున్న కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిని సందర్శించి ఆధునిక చికిత్స విధానాలను తెలుసుకోవడం ఎంతో ఉపయోగపడుతుందని డాక్టర్ కేథరీన్ కాలిన్స్ ఫులియా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఇంటర్నేషనల్ బిజినెస్ రిలేషన్స్ హెడ్ గోకుల్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.



కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిని సందర్శించిన అమెరికన్ కాలేజ్ ఆఫ్ నర్స్ మిడ్ వైఫ్స్ ప్రతినిధులు



ఈశ్వరీబాయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ జె.గీతారెడ్డి

ఈశ్వరీబాయి సేవలు చిరస్మరణీయం

మారేడుపల్లి,డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతికి నిరంతరం సేవలందించిన ఘనత రిపబ్లికన్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే ఈశ్వరీ బాయికి దక్కుతుందని మాజీ మంత్రి డాక్టర్ జె.గీతా రెడ్డి కొనియాడారు. ఈశ్వరీ బాయి 106వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం మారేడుపల్లిలోని సెయింట్ జాన్స్ చౌరస్తాలోని ఆమె విగ్రహానికి జె.గీతారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ఈశ్వరీ బాయి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో మహిళల హక్కుల సాధన కోసం గళమెత్తిన మహనీయురాలని, ఆమె సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో ఈశ్వరీ బాయి మెమోరియల్ ట్రస్ట్ వైస్ ఛైర్మన్ రామచంద్రా రెడ్డి, మేఘనా రెడ్డి, ప్రముఖులు కె.నర్సింహులు, ఉమేష్, మహేష్, బాలకృష్ణా రెడ్డి, శివకుమార్, నరేందర్, సైదులు, నర్సింగ్ కళాశాల డాక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న బాలకోటి రెడ్డి తదితరులు

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

చిలకలగూడ, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): చిలకలగూడ, దూద్‌బావి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్ జూబ్లీ హిల్స్, పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి, చెవి. ముక్కు, గొంతు వైద్య శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు బాలకోటి రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి వైద్య శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, తరచూ వైద్య పరీక్షలు చేయిం చుకోవాలన్నారు. కంటి చూపు, వినికిడి సమస్యలు ఉన్న 280 మందికి పరీక్షలు చేసి అవసరమైన వా రికి కళ్లజోళ్లు అందజేసి మందులు సూచించారు. పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున రెడ్డి, ప్రాజెక్ట్ ఇన్‌చార్జి రాజాకృష్ణ, డాక్టర్ అక్షిత్, ఎన్‌ఏవీ సాగర్, అరుణ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, పక్కన బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి తదితరులు

కాంగ్రెస్ 'గ్యారెంటీ' మోసాలపై ప్రజలను చైతన్యం చేస్తాం

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

చాదర్‌ఘాట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల గారడీ, 6 అబద్ధాలు, 65 మోసాలపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. ఆదివారం దిల్‌సుఖ్‌నగర్‌లో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 అసెంబ్లీ ఎన్నికల వేళ 100 రోజుల్లో 6 గ్యారెంటీలు, ఏడాదిలో 66 వాగ్దానాలు, 5 ఏళ్ల పదవి కాలంలో మ్యానిఫెస్టో హామీలను నెరవేరుస్తామని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో ఏ ఒక్క గ్యారెంటీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, డిక్లరేషన్లన్నీ నీటి మీది రాతలే అన్నారు. లగచర్లలో భూసేకరణ పేరిట రైతులపై అక్రమ కేసులు పెట్టి పోలీసులచే దాడులు చేయించడం కాంగ్రెస్ మార్క్ ప్రజాస్వామ్య పాలనా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో అనుభవించిన కష్టాలను ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వంలో అనుభవించారన్నారు. రేవంత్ మర్చిపోయిన వాగ్దానాలపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు బీజేపీ ముందుకొచ్చిందన్నారు. పేదలకు బీజేపీ అండగా ఉంటుందన్నా రు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, సురేందర్‌యాదవ్, కార్పొరేటర్లు బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కళ్లెం జీవన్‌రెడ్డి, లచ్చిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి తదితరులు

కాంగ్రెస్ పార్టీవన్నీ ఉత్తుత్తి వాగ్దానాలే: బీజేపీ

బౌద్ధనగర్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీ పథకాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 66 మోసాలు చేసిందని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, మేకల సారంగపాణిలు మండి పడ్డారు. బీజేపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు ఆదివారం వారాసిగూడలో ఆరు గ్యారెంటీలు, 66 మోసాలపై చార్జీషీట్ పేరిట ఏర్పాటుచేసిన సమావేశంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల పాలనలో తేడా ఏమీ లేదని రెండు దొందూ దొందేనన్నారు. మొదటి గ్యారెంటీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం కల్పించినట్లు ప్రభుత్వం చెప్పుకుంటోంది కానీ.. దాని పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలిసిందేనన్నారు. కేవలం ఒక ఏడాదిలోనే ఇంతటి ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న ఏకైకా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి పెద్ది రవీందర్‌రెడ్డి, సీకే శంకర్రావు, వంశీతిలక్, కార్పొరేటర్ చీరాల సుచిత్ర, కన్వీనర్లు కందాడి నాగేశ్వరరెడ్డి, రమేష్, శ్రీశైలంగౌడ్, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, ఆకారం రమేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాజు, సీతాఫల్‌మండి అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు పాల్గొన్నారు.